# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 241
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జూన్ 25, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## 26నుంచి శాకంభరీ

- 15 రోజుల పాటు నిర్వహణ
- భద్రకాళి దేవస్థానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది




## ఎమర్జెన్సీ.. ఒక చీకటి అధ్యాయం

- 1975 జూన్ 25 మరిచిపోలేని రోజు
- బానిసత్వ లక్షణాల పర్యవసానమే ఎమర్జెన్సీ
- దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు

7లో..







# చిక్కడు..దొరకడు..!

## విద్యాశాఖలో సీసీ దందా

- అంతా నేనే అంటూ గప్పాలు
- డీఈఓను కలవాలంటే ఆయనను ప్రసన్నం చేసుకోవాల్సిందే
- విద్యాశాఖాధికారిని తక్కువ చేసేలా వ్యవహారం
- వరంగల్ డీఈఓ కార్యాలయంలో ఆయనదే హవా

వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో క్యాంప్ క్లర్క్ (సీసీ) హవా కొనసాగుతోంది. డీఈఓ చాంబర్ లోకి అడుగు పెట్టాలంటే ముందు ఆయనను ప్రసన్నం చేసుకోవల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు నమస్తే పెట్టి.. చెప్పినట్లు చేస్తేనే డీఈఓను కలిసేందుకు అనుమతి అభిస్తుంది. కాదు, కూడదంటే నో పర్మీషన్.. సార్ వీడియో కాన్ఫరెన్స్ లో ఉన్నారు.. స్టేట్ బాస్ తో ఆన్ లైన్ లో మాట్లాడుతున్నారు ఇప్పుడు కుదరదంటూ కటింగ్ ఇస్తారు. ఫోన్ ఉంటే ఎట్టి పరిస్థితిలో లోపలికి వెళ్లేది లేదంటూ ఆర్డర్ వేస్తాడు. పాత్రికేయులకు సైతం మినహాయింపు లేదంటూ వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లను లాక్కుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని నిబంధనలు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు. సభ్యత, సంస్కారాలను పక్కనబెట్టి అహంకారంతో విర్రవీగడంపై ఉద్యోగ సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడ తానే సుపీరియర్ అంటూ విద్యాశాఖాధికారిని తక్కువ చేసేలా వ్యవహరిస్తున్నారు. చిక్కడు..దొరకడు అన్నట్లుగా జిల్లాలోని వ్యవహారాలన్నీ సీసీనే చక్కబెడుతూ పర్సంటేజీల వారీగా పంపిణీ చేస్తున్నందునే హద్దు మీరి ప్రవర్తిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. అయితే తనకు వచ్చేది వస్తున్నందునే డీఈఓ సైతం సీసీని వెనకేసుకొస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..




2లో..

## సర్పంచులు లేరు.. కార్యదర్శులు రారు..

- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- పట్టించుకునేవారు లేక ఇబ్బందులు



8లో..

## గిరిజన ఆశ్రమ పాఠశాలగా మార్పు

- గురుకులంగా అభివృద్ధి చేసేందుకు కృషి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



8లో..

## విద్యార్థులెక్కడ..?

- కలెక్టర్ స్నేహ శబరీష్
- హాజరు శాతం తక్కువ ఉండడంతో సీరియస్




# చిక్కడు..దొరకడు..!

## విద్యాశాఖలో సీసీ దందా

- అంతా నేనే అంటూ గప్పాలు
- డీఈఓను కలవాలంటే ఆయనను ప్రసన్నం చేసుకోవాల్సిందే
- విద్యాశాఖాధికారిని తక్కువ చేసేలా వ్యవహారం
- వరంగల్ డీఈఓ కార్యాలయంలో ఆయనదే హవా

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో క్యాంప్ క్లర్క్ హవా కొనసాగుతోంది. ఆయన తన ఉద్యోగ ధర్మాన్ని పక్కనబెట్టి అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. కార్యాలయానికి వచ్చే వారినెవరినీ లెక్క చేయకుండా వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఆయన రుబాబుకు అంతే లేకుండా పోయింది. ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజా ప్రతినిధులంటే ఆయనకు లెక్కేలేదు. ఎవరైనా ముందు తనను ప్రసన్నం చేసుకోవాల్సిందే అన్నట్లు సీసీ వ్యవహార శైలి ఉందన్న ఆరోపణలున్నాయి. విధులను దుర్వినియోగం చేస్తూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నారు.

### లక్ష్మణ రేఖ..


తనను కలువకుండా వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ ను కలిసేందుకు వీలు లేదంటూ క్యాంప్ క్లర్క్ జి.నిరంజన్ రెడ్డి లక్ష్మణ రేఖ గీశారు. ఎవరైనా డీఈఓ కార్యాలయానికి వస్తే ముందు వారి సెల్ ఫోన్లను బయట పెట్టాల్సిందే. లేకుంటే ఆయనే గుంజుకుంటాడు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫారసులతో డీఈఓకు కలిసేందుకు వచ్చినా పై నిబంధనలు పాటించాల్సిందే అంటూ హుకుం జారీ చేస్తున్నారు. మానవత్వం, నైతిక విలువలు ఆయనలో మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రజా సంఘాలు, పాత్రికేయులు కలిసేందుకు వెళ్లినా తన అనుమతి లేకుండా డీఈఓను కలిసేది లేదంటూ తేల్చి చెప్పుతున్నారు. వారిని సాయంత్రం.. రేపు.. ఎల్లుండి అంటూ తిప్పుకోవడం పరిపాటిగా మారింది.

### ఆయన కనుసన్నల్లోనే..

అయితే ఇదంతా జిల్లా వాద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్ కనుసన్నల్లోనే జరుగుతోందన్న ప్రచారం ఉంది. డీఈఓను మచ్చిక చేసుకున్న ఆయన ప్రతీది తన కనుసన్నల్లోనే జరగాలంటున్నారు. కారుణ్య నియామకం ద్వారా విద్యాశాఖలో చేరిన నిరంజన్ రెడ్డి కాసులకు కక్కుర్తి పడతారనే ఆరోపణలున్నాయి. జిల్లా అధికారిని కలవాలంటే ముందు సీసీకి సమర్పించుకోవాలని బాహాటంగానే ప్రచారం జరుగుతోంది. వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే వారిని కాసులకోసం ఇబ్బందులు పెడుతున్నారని, ఆమ్యామ్యాలు సమర్పించని వారిని కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎమ్మెల్యే బంధువంటూ..

తాను ఓ ఎమ్మెల్యే బంధువునంటూ డీఈఓ కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఈఓకు చెప్పి ఫైళ్లను పెండింగ్ లో పెట్టించి బేరసారాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. సెక్షన్లలో కొందరిని ఏజెంట్లుగా పెట్టుకొని డబ్బులు దండుకుంటున్నారనే విమర్శలున్నాయి. పెద్ద సారుకు కొంత.. నాకు కొంత అంటూ



అందిన కాడికి దండుకుంటున్నారు. ఆయన అవినీతి మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతున్నప్పటికీ కట్టడి చేసే అధికారులు లేరనే విమర్శలున్నాయి. అయితే డీఈఓ కార్యాలయంలోని అక్రమార్కులపై ప్రభుత్వ నిఘా సంస్థలు దృష్టి సారించినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ సైతం వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# సర్పంచులు లేరు.. కార్యదర్శులు రారు..

- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- పట్టించుకునేవారు లేక ఇబ్బందులు

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట మండలంలో 15 నెలలుగా సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శుల హవా నడుస్తోంది. సర్పంచులు లేరు.. కార్యదర్శులు రారు అన్న చందంగా గ్రామాల్లో పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు అటకెక్కాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం జరుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యదర్శులను ప్రశ్నించే వారు లేకపోవడంతో గ్రామపంచాయతీలో వారి హవా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లోని చిన్న, చిన్న అవసరాలపై కూడా కార్యదర్శులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల ఫోన్లు వస్తే తప్ప కార్యదర్శులు స్పందించడం లేదని మండలంలోని అనేక గ్రామ పంచాయతీల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తాము చాలా బిజీగా ఉన్నామని చెప్పుకొంటూ ప్రజలకు దూరమవుతున్నారు. వర్షాకాలం ఆరంభం కావడంతో దోమల బాధ పెరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే దోమల నివారణకు కనీసం రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లే వారే కరువయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను తీర్చాల్సిన కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల పేరు చెప్పి మండల కేంద్రానికే పరిమితం కావడంపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీల్లో కనిపించని కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పలు గ్రామాల్లోని విద్యుత్ తీగలకు చెట్లు తాకడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎంపీడీఓ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని గ్రామ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# 26నుంచి శాకంభరీ

- 15 రోజుల పాటు నిర్వహణ
- భద్రకాళి దేవస్థానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్ర కాళి దేవస్థానంలో 15 రోజుల పాటు జరిగే శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు ఈ నెల 26వ తేదీ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. మొదటి రోజు అమ్మవారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం నిత్యాయాగం ప్రారంభమౌతుందన్నారు. ఈ యాగాన్నే తిథిమండల దేవతా యజనం అని కూడా అంటారన్నారు. మాసంలోని ప్రతి తిథికి జ్యోతిశ్శాస్త్రం ప్రకారం అధిదేవతలున్నట్లే వైదిక స్మార్త శక్తాద్వైత దక్షిణాచార సంప్రదాయాన్ని అనుసరించి ప్రతి తిథికి కాళీ క్రమంలో షోడశి క్రమంలో ఒక్కొక్క అధిదేవత ఉంటుంది. ఈ దేవతలను ఆరాధించడం వల్ల ప్రకృతి సమతౌల్యత దెబ్బతినకుండా ఉండటమే గాక సమస్త మానవాళి సుఖశాంతులతో వర్ధిల్లుతారన్నారు. ఈ పదిహేను రోజులు ఉదయం కాళీ క్రమంలో సాయంకాలం శ్రీ (షోడశి) క్రమంలో ఈ నిత్యాయాగం అనగా తిథిమండల దేవతార్చన జరుగుతుందని వివరించారు.

### విస్తృత ఏర్పాట్లు..

ఆఖరి రోజు జులై 10న శాకంభరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శేషు భారతి తెలిపారు. పలు విధములైన కూరగాయలతో అమ్మవారిని




శాకంభరిగా అలంకరిస్తారని వెల్లడించారు. ఆ రోజు అమ్మవారిని దర్శించడానికి వేలాదిగా భక్తులు గుడికి పోటెత్తుతారన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం ధర్మకర్తల మండలి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు తోనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి, నార్ల సుగుణ, జారతి వెంకటేశ్వర్లు, పాలడుగుల ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్ రావు, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ముఖ్య అర్చకులు పర్నంది నర్సింహా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జూన్ 25, 2025

# గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల శాఖ గ్రంథాలయానికి ఉపాధ్యాయులు తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి సుమారు రూ.5000 విలువైన వివిధ రకాల పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథ పాలకులు డి.రాజేంద్ర ప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యావేత్త ఎస్ వి విద్యా సంస్థల అధినేత డా సిరికొండ శ్రీనివాస చారి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిదని అన్నారు. ఉపాధ్యాయులు కవి కామిడి సతీష్ రెడ్డి పరకాల గ్రంథాలయానికి స్వంతంగా పుస్తకాలు కొనుగోలు చేసి అందించడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివి ఉత్తమ పాఠకులుగా ఎదగాలన్నారు. పుస్తక ప్రియులు సతీష్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని పరకాల గ్రంథాలయానికి తమ వంతుగా పుస్తకాలు బహుకరించి గ్రంథాలయాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ముఖ్య సలహా దారులు యడ్ల సుధాకర్,



జర్నలిస్ట్ రేపాల నర్సింహా రాములు, రంగ స్థల కళాకారులు ఏర్కొంద రామ దాసు, బీఎంఎస్ సీనియర్ నాయకులు ఆడగాని జనార్దన్ రావు, గ్రంథాలయ సిబ్బంది అరుణ, పాఠకులు నూతన్, యాట రాజేందర్, రవి, సురేష్, నవీన్, శ్రీనివాస్, అజయ్, సుమలత, మేఘన, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

## రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి




**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలతో తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. దురలవాట్లకు దూరంగా ఉండి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలు వాడటం వల్ల కలిగే నష్టాలను తెలుసుకోవాలన్నారు. మత్తుకు దూరంగా ఉండాలని ఉద్బోధించారు. మత్తు పదార్థాలను విక్రయించినా, వాటిని వాడినా వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాజాన్ని రక్షించడంలో యువత, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే, వెంటనే 112 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌కు ఇద్దరి ఎంపిక






**వరంగల్ వాయిస్, జనగామ:** అండర్-18 జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2025 (బాలుర, బాలికల) పోటీలకు జనగామ జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. జనగామ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై.కుమార్ గౌడ్, కార్యదర్శి గట్టయ్య, కోశాధికారి ఉప్పలయ్య ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరగనున్న పోటీలకు జిల్లాకు చెందిన యు.సంతోష్ (బాలికల విభాగం), జశ్వంత్ (బాలుర విభాగం) ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి జులై 1 వరకు జరిగే ఈ పోటీలలో వీరు పాల్గొంటారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటడం పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎంఏ తెలుగు కోర్సు ప్రవేశ గడువు ఆలస్య రుసుముతో జూన్ 30 వరకు పెంపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025-26 సంవత్సరానికి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశానికి గడువు ఈ నెల జూన్ 24తో ముగిసింది. ఈ మేరకు వంద రూపాయల అలస్య రుసుముతో జూన్ 30 వరకు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలుగు యూనివర్సిటీ వెబ్సైట్ www.teluguuniversity.ac.in, www.pstucet.org సూచించారు. వివరాల కోసం 99891 39136, 99894 17299 సెల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన రాచపల్లి (ఎర్ర) సమ్మయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం బుధవారం బిజిగిరి షరీఫ్‌లోని సమ్మయ్య నివాసానికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సమ్మయ్య కుమారులు రాచపల్లి అంబేద్కర్, రాచపల్లి జగ్గీవన్లను పలకరించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ, రాచపల్లి (ఎర్ర) సమ్మయ్య మృతి వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచపల్లి రమేష్, నగరం గ్రామ శాఖ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సంపత్ ఉన్నారు.

# నిరుపేద కుటుంబాలకు చేయూత



**వరంగల్ వాయిస్, సిద్దిపేట :** సనాతన హిందూ సేవా సమితి తన 81వ సేవా కార్యక్రమంలో భాగంగా భర్త చనిపోయి ఆరోగ్య సమస్యలు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సిద్దిపేట జిల్లా దూలిమేట కొండాపూర్ గ్రామానికి చెందిన రెండు నిరుపేద కుటుంబాలకు చెందిన దూల్మెట రాణి, గర్నేపల్లి మణెమ్మలకు రెండు నెలలకు సరిపడా బియ్యం,నిత్యవసరాలు అందించారు. గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు,గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, మాలోత్ రవి, పాల్తీయా రమేష్ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యోగుల సమ్మె సైరన్

## వైద్యాధికారికి నోటీసు అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఉద్యమబాట పట్టాయి. ఇందులో భాగంగా జులై 9న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో భారీ ధర్నా నిర్వహించనున్న నేపథ్యంలో, సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును బుధవారం వరంగల్ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎం.యశస్వినికి ఉద్యోగులు అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ అమలు చేయడం లేదని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయించడంలో జిల్లా లేబర్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ ఆర్.భాగ్యలక్ష్మి, ఏ.ఎన్.ఎం. కోమల తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను బుధవారం అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. లబ్ధిదారులకు విడుదలవారీగా రూ.5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామన్నారు. ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని, అలాగే ప్రభుత్వ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు.

# ఘనంగా ఏఐఎస్‌బీ 75వ వార్షికోత్సవం

**వరంగల్ వాయిస్, వరంగల్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌బీ) 75వ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్‌లోని వేణురావు కాలనీలో ఉన్న ఏకశిల జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్‌బీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ, ఏఐఎస్‌బీ 1951 జూన్ 25న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో స్థాపించబడిందని తెలిపారు. "సోషలిజం, శాంతి, అభ్యుదయం" అనే నినాదాలతో, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధన కోసం గత 74 ఏళ్లుగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ, ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాల అసమర్థ విధానాల వల్ల పేద విద్యార్థులకు విద్య అందని



ద్రాక్షగా మారిందని విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై భవిష్యత్ పోరాటాలను మరింత బలంగా నిర్వహించడానికి విద్యార్థులు ఏఐఎస్‌బీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, జిల్లా నాయకులు పెండ్యాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరిపై దాడి అనైతికం



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే పత్రికా విలేకరులపై దాడి చేయడం అనైతికమైన చర్య అని మండల జర్నలిస్టులు, విద్యావంతుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాదండి దేవేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కుమారస్వామిలు అన్నారు. తాడ్వాయి మండల ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీకాంత్ రెడ్డిపై మంగళవారం జరిగిన దాడులు నిరసిస్తూ మండల కేంద్రంలోని చౌరస్తాలో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛ భారత రాజ్యాంగంలో ఒక భాగమని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే పత్రిక విలేకరులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సరికాదన్నారు. సమాజ హితం కోసం విలేకరులు స్వేచ్ఛపూరిత వాతావరణంలో పని చేసే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు యాదగిరి, శ్రీనివాస్, రవి, రామకృష్ణ, కుమార్, కిషోర్, మురళి, వెంకట్, రమేష్, విష్ణు, బాబు, శంకర్, ఎల్లయ్య ఉన్నారు.

# న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బెంగళూరు క్యాంపస్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యార్థుల అసాధారణ విజయాలతో స్ఫూర్తి పొంది, న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బెంగళూరులో అధునాతన సాంకేతిక విద్యాబోధన కోసం తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించింది. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండో సంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో అసాధారణ స్థాయిలో 93 శాతం మంది అగ్రశ్రేణి టెక్ సంస్థలు, ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు పొందారు. రేజర్‌పే, సర్వం ఏఐ, జూమ్‌కార్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు, డీఆర్‌డీఓ లాంటి గౌరవనీయ పరిశోధనా సంస్థల్లో వీరు ఇంటర్న్‌షిప్‌లు సాధించారు. భారతదేశ ప్రముఖ టెక్, స్టార్టప్ కేంద్రమైన ఎలక్ట్రానిక్ సిటీలో న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సరికొత్త క్యాంపస్‌ను నిర్మించింది. ఉద్యోగాలకు సిద్ధం చేసే ఆచరణాత్మక టెక్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం ఈ క్యాంపస్ ప్రధాన లక్ష్యం. ఈ కొత్త క్యాంపస్‌లో 2,500 మంది విద్యార్థులు చదువుకునే వీలు కల్పించారు. అలాగే, 1,000 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు కూడా ఉంటాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి ప్రత్యేక కోర్సులతో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యా విధానాన్ని రూపొందించారు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవిత పరిశ్రమ అనుభవంతో జోడించి, విద్యార్థులు ప్రాక్టికల్ నైపుణ్యాలతో, బలమైన ప్రొఫైల్‌తో, ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుతారు. "న్యూటన్ స్కూల్‌లో, మేము టెక్ పరిశ్రమను నేరుగా తరగతి గదిలోకి తీసుకువస్తున్నాం. దీంతో విద్యార్థుల అభ్యాసం మరింత ఆచరణాత్మకంగా, ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా, ఇంకా ప్రభావవంతంగా మారుతుంది" అని న్యూటన్ స్కూల్ సహ-వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ మహేశ్వరి తెలిపారు.

# కేవీ సంతోష్ బాబుకు పీవీ స్మారక అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారత తొలి తెలుగు మాజీ ప్రధాని, భారతరత్న పి.వి. నరసింహారావు 104వ జయంతి సందర్భంగా పీవీ స్మారక అవార్డు ప్రదానోత్సవ సభను ఈ నెల 28న (శనివారం) నక్కలగుట్టలోని వరంగల్ దర్శన్ సెమినార్ హాలులో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు అభినందన భారత్ ఫోరం (అబోప) అధ్యక్షుడు లయన్ మోత్కూరు మనోహర్ రావు తెలిపారు. ఈ సంవత్సరం పీవీ అవార్డు స్వీకర్తగా ప్రముఖ సాహితీవేత్త, కరీంనగర్ పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కల్వకోట సంతోష్ బాబును ఎంపిక చేసినట్లు అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ గన్నమరాజు గిరిజామనోహర బాబు వెల్లడించారు. ఈ అవార్డు కింద రూ.10,116 నగదు పారితోషికం, ప్రశంసాపత్రం అందించనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. పీవీ నరసింహారావు మేనకోడలు మోత్కూరు ఇందిరా మనోహర్ రావు ఈ అవార్డును అందజేయనున్నారు.ఈ సభకు పీవీ అభిమానులు, సాహితీవేత్తలు, అబోప సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అబోప ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాలకుర్తి దినకర్ కోరారు.

# విజ్ఞానంతోనే భవిష్యత్‌కు పునాది

◆ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పట్టణంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరాభ్యాసం పలకల పంపిణీ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు, ఒక లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. నితిన్ భవన్‌లో వందేమాతరం ఫౌండేషన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల కోసం 10 వేల అక్షరాభ్యాస పలకల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఝాన్సీ రాజేందర్ రెడ్డి స్వయంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ రావు అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని కొనియాడారు. ఫౌండేషన్ చేపడుతున్న విద్యా సేవా కార్యక్రమాలు ఎంతో ప్రేరణాత్మకంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి తమ వంతు కృషిగా, తన కుటుంబ ట్రస్ట్ ద్వారా తక్షణ విరాళంగా ఒక లక్ష రూపాయలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. "విజ్ఞానమే భవిష్యత్తుకు పునాది" అన్న దృష్టితో చిన్నారుల్లో విద్యపై ఆసక్తి కల్పించేందుకు, అక్షరాభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అత్యంత అవసరమని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి.

# పొడిచెట్టి విష్ణువర్ధన్‌కు 'అత్యున్నత మానవతావాది' అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్‌కు శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి పక్షాన అత్యున్నత మానవతావాది అవార్డును ప్రదానం చేసినట్లు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వంగాల శాంతి కృష్ణ ఆచార్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్ నగరానికి చెందిన శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'విశ్వ కళా వైభవం' పేరుతో 1111వ అంతర్జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలను రెండు రోజుల పాటు ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాజకీయ ప్రముఖులు, అధికారులు, అనధికారుల సమక్షంలో ఘనంగా నిర్వహించినట్లు శాంతి కృష్ణ తెలిపారు. శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షికోత్సవంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి అవార్డులకు ఎంపిక చేస్తారని, అందులో భాగంగా ఈ ఏడాది డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను గుర్తించి 'అత్యున్నత మానవతావాది' అవార్డుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు కాకతీయ విశ్వవిద్యాలయంలో విష్ణువర్ధన్‌ను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, రాబోయే కాలంలో రెట్టించిన ఉత్సాహంతో పలు సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ మానవీయ కోణంలో ముందుకు సాగుతానని అన్నారు. అవార్డు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు అందుకున్న విష్ణువర్ధన్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# గణపురంలో రైతు భరోసా సంబరాలు



**వరంగల్ వాయిస్, గణపురం:** వానాకాలం పంటల సాగు కోసం రైతు భరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పండుగ' పేరుతో సంబరాలు నిర్వహించింది. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం గణపురం మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ సెంటర్‌లో ఘనంగా రైతు భరోసా సంబరాలు జరిగాయి. మండల పార్టీ అధ్యక్షులు రేపాక రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల నగదు బదిలీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు అని పేర్కొన్నారు. ఇప్పటివరకు కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. రుణమాఫీ పథకాన్ని కూడా 2024 ఆగస్టు 15లోగా పూర్తిచేశామని చెప్పారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ. 5 వేలు చొప్పున ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 6 వేల చొప్పున సంవత్సరానికి రూ. 12 వేలు రైతులకు అందిస్తోందని జీఎస్సార్ వివరించారు. కేంద్రం కొనుగోలు చేయలేని పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తోందని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం



**వరంగల్ వాయిస్, నడికూడ:** గత విద్యా సంవత్సరం 2024-25లో నడికూడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన మొదటి పది మంది విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతిభా పురస్కారాలను అందజేసింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ అందించిన మెమెంటోలు, శంకర్ నారాయణ అందించిన డిక్షనరీలను మండల విద్యాధికారి, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. బహుమతులు అందుకున్న మొదటి పది మంది విద్యార్థులు ఎం.వర్షిత్ (నడికూడ), కే.భవిత (రాయపర్తి), బి.ప్రణయ్ (నడికూడ), ఎం.అక్షయ (నడికూడ), ఈ.వినోద్ (నార్లాపూర్), బి.సాయి తేజ (కౌకొండ), సీహెచ్.ప్రేంజిత్ కుమార్ (చర్లపల్లి), టి.ఉమేష్ చంద్ర (వరికోల్), టి.గణేష్ (నడికూడ), బి.రఘు (నడికూడ), ఈ.యుమిక (నడికూడ), టి.సన్నీ (నడికూడ) ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్.వేణుగోపాల్, ఉపాధ్యాయులు డి. శ్రీనివాసులు, డి.శ్రావణ్ కుమార్, శివచేతన్ తో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలం మార్కండేయనగర్ సీపీఐ శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సీపీఐ కార్యకర్తలు సిద్దంగా ఉండాలని, ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే మేలు జరుగుతుందని, ప్రజలు భావిస్తున్నారని, నిత్యం ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని చెప్పారు. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేదలను సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన సీపీఐ దేనని అన్నారు. బడా బాబుల, కబ్జాకోరుల మధ్య అన్యాక్రాంతమైన, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పేద ప్రజలకు పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కబ్జా కోరులపై, వారికి సహకరించిన సంబధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముందు సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి మహాసభ ప్రాంగణంలో ఎర్ర జెండా ఎగురవేశారు. అనంతరం అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ మహాసభకు సుంకరి భవానీ, నల్లతీగల కుమార్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ కే బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, తాళ్లపెల్లి జాన్ పాల్ ఓర్సు రాజు, గుండె బద్రి, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జూలై 9 సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని హమాలీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్ అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులకు నష్టం చేసే విధంగా రూపొందించారని ఆయన అన్నారు. దీనితో కార్మికులకు సమిష్టి బేరసారాల హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు, సామాజిక భద్రత లాంటివి లేకుండా పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 9 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన హమాలీలకు రూ. 25 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వమే హమాలీలకు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమస్యల సాధన కోసం జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని హమాలీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సంఘాల మొగిలి, బోట్ల చక్రపాణి, జిల్లా నేతలు ఇనుగాల సుదర్శన్, ల్యాదల విజేందర్, మంతపురి సదానందం, మామిళ్ల రాజయ్య పాల్గొన్నారు.

# హిందూ ఫాసిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనేక ఆటంకాల మధ్య బుధవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర సదస్సు ఆలస్యంగా జరిగింది. గత వారం రోజుల క్రితం సదస్సుకు పర్మిషన్ ఇవ్వాలని నగర పోలీస్ అధికారులకు రాతపూర్వకంగా కోరినప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. నేటి మధ్యాహ్నం 12 గంటల తర్వాత అనుమతి ఇచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో భారత రాజ్యాంగం ఆదివాసుల హక్కులు శాంతి చర్చలు అనే అంశాలపై మధ్యాహ్నం 12 గంటల నుంచిమూడు గంటల వరకు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు మండల వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సదస్సు ముఖ్య అతిగా వచ్చినటువంటి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జైవీ చలపతిరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా పనిచేస్తున్నదని విమర్శించారు. ఈ సదస్సులో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్, రాష్ట్ర నాయకులు ఆవు నూరి మధు, గౌని ఐలయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, ముక్తి సత్యం, ఇనాం సంస్థ నాయకులు జుబేర్ సుభాన్ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వరరావు, గట్టి కృష్ణ, తిరుపతి, బొమ్మెడ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేయూ భూముల జోలికొస్తే ఖబడ్దార్

● ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై బీఆర్ఎస్వీ వార్నింగ్



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్సిటీ (కేయూ) భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, ప్రభుత్వ భూముల్లోనే ఈ స్కూల్‌ను నిర్మించాలని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు/ఇంచార్జి భైరపాక ప్రశాంత్, జట్టి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ భూములను వీసీ ప్రతాపరెడ్డి తన సొంత నిర్ణయంతో ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను యూనివర్సిటీ భూమి కాకుండా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, దానికి అనుగుణంగానే కొత్త కోర్సులు, కొత్త హాస్టళ్లు, కొత్త ఇన్నోవేషన్లకు భూ అవసరాలు ఉంటాయని గుర్తు చేశారు. యూనివర్సిటీ చరిత్రలో ఏనాడు పాలకవర్గం భూ కేటాయింపులు చేయలేదని, ఇప్పటికే ఎన్నో ఎకరాల భూమి కబ్జాకు గురైందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో రూ. 100 కోట్ల విలువైన భూమిని ఇచ్చేయడానికి యూనివర్సిటీ నిర్ణయం తీసుకోవడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులతో ఎక్కడ సమావేశం నిర్వహించలేదని వారు ఆరోపించారు. యూనివర్సిటీ భూములను కేటాయించడానికి అన్ని విద్యార్థి సంఘాలు, మేధావులు, అధ్యాపకులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిలోనే ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మించాలని మరోసారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పాలకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, అర్బన్, రూరల్ కోఆర్డినేటర్లు అరూరి రంజిత్, లంక రాజగోపాల్, గంద్రకోట రాకేష్ యాదవ్, యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకులు కొనకటి ప్రశాంత్, పస్తం అనిల్, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

# కిరాణ షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కాలం చెల్లిన నిత్యావసర సరుకులు స్వాధీనం



**వరంగల్ వాయిస్, మట్టెవాడ:** వరంగల్‌లోని పిన్నవారి వీధిలో పబ్బతి కృష్ణమూర్తి నడుపుతున్న ఉదయ లక్ష్మి కిరాణా షాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో కాలం చెల్లిన వివిధ కంపెనీలకు చెందిన బాత్‌రూమ్ క్లీనర్స్ (హార్పిక్, డోమెక్స్, వావ్, మోర్), ఫ్లోర్ క్లీనర్స్, హ్యాండ్‌వాష్ బాటిల్స్, ఫేస్ పౌడర్ బాటిల్స్, గ్లాస్ క్లీనర్స్, హెయిర్ ఆయిల్ బాటిల్స్, బాడీ లోషన్ బాటిల్స్, డిష్‌వాష్ బాటిల్స్ (హాండ్స్ ఆన్, బజాజ్, స్పింజ్, ప్యారాచూట్, డెటాయిల్, గ్రేట్ వాల్యూ వంటివి) అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.1,23,500 విలువైన ఈ కాలం చెల్లిన సరుకులను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యజమాని (నిందితుడు) పబ్బతి కృష్ణమూర్తిని విచారణ నిమిత్తం మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ఎస్ఐ భాను ప్రకాష్, వరంగల్ మున్సిపల్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కానిస్టేబుళ్లు సురేష్, సురేందర్, సాంబరాజు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్‌లో సమస్యలు



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌ను ధర్మ సమాజ్ పార్టీ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ బ్యాంక్‌లో సుమారు 80,000 మంది ఖాతాదారులు ఉండగా, కేవలం ముగ్గురు సిబ్బంది, ఒకరిద్దరు సహాయ సిబ్బంది మాత్రమే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రోజుకు మండలంలోని 17 గ్రామాలకు అదనంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఖాతాదారులు వస్తున్నారని, వీరందరికీ సరిపడా సిబ్బంది లేరని కండె రవి తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా, ధాన్యం కొనుగోలు డబ్బులు ఒకేసారి ఖాతాల్లో జమ కావడంతో రైతులు, ఇతర ఖాతాదారులు పెద్ద సంఖ్యలో బ్యాంకుకు వస్తున్నారని, అయితే వారి డబ్బులను సకాలంలో చెల్లించడంలో ప్రభుత్వం, బ్యాంకు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ఇక ముందు ఇలాగే కొనసాగితే ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బ్యాంక్ ఖాతాదారులు అందరితో కలిసి ధర్నా, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ గాంధీనగర్ గ్రామ అధ్యక్షులు ఇంజపల్లి విక్రమ్, నరసన్న మొగిలి, వినయ్ శ్రీ కరణ్ తో పాటు పలువురు బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీతో ప్రజలకే నష్టం



**వరంగల్ వాయిస్, పరకాల:** 1975లో విధించిన ఎమర్జెన్సీ వల్ల ప్రజలకు జరిగిన అన్యాయం, కష్టనష్టాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షులు కాసగాని రాజ్‌కుమార్ గౌడ్ సూచించారు. పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మండల కమిటీ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి, దయ్యాల దేవరాజ్, బాలాజీ మురళి కృష్ణ, జె. లింగయ్య, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి రాజేందర్ రావు, గుండెబోయిన నర్సయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబు యాదవ్, ఉపాధ్యక్షులు సలెంద్ర భాస్కర్, కునూరు వసంత, కోశాధికారి ఎదునూరి లింగయ్య, మాజీ సర్పంచులు చిర్ర చక్రపాణి, ఎ.సురేష్, బూత్ అధ్యక్షులు కోరే సురేష్, తండ కుమారస్వామి, పి.రాంబాబు, కె.సాంబయ్య, మహేందర్ రెడ్డి, నాయకులు ఎన్.కొమురయ్య, ఎ. ప్రమోద్ కుమార్, టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత స్థాయిలో బల్దియా కమిషనర్, కార్పొరేటర్ పర్యటన

## సమస్యల పరిష్కారానికి హామీ



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31వ డివిజన్‌లో బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు పర్యటించారు. ఈ సందర్భంగా వారు కేఆర్ టౌన్‌షిప్‌లో పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పార్క్‌లో పిల్లల ఆట వస్తువులు, ప్రజలకు ఉపయోగపడే జిమ్ పరికరాలను సమకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీ అధ్యక్షులు గుజ్జ సత్యనారాయణ రావు, ఉపాధ్యక్షులు రాములు నాయక్, హరికృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025లో జిల్లా ముందంజలో ఉండాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025లో జిల్లాను దేశంలో అగ్రగామిగా నిలపాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో అన్ని మండలాల ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఎంలు, ఏపీవోలు, అన్ని పంచాయితీ కార్యదర్శులకు ఎస్ ఎస్ జీ–2025 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య కార్మికుల పనితీరు బాగుండాలన్నారు. ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా..సరైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతీ గ్రామానికి 20 చొప్పున ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు .ఎస్.ఎస్.జి(జి) పారామీటర్స్ అన్నీ సరిగా ఉండాలని... ప్రతి పౌరుని ద్వారా ఎస్ బీఎం (జి) ఎస్ఎస్ జీ–2025 మొబైల్ యాప్ ద్వారా సిటిజన్ feedback ఇచ్చేలా కృషి చేసి జిల్లా ప్రతిష్టని నిలపాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ కి సంబంధించిన పోస్టర్ కలెక్టర్ ఆవిష్కరించారు జిల్లా పంచాయితీ అధికారిణి స్వరూప, డీఎల్ పీఓ వెంకట్ రెడ్డి, ఎస్ బీఎంఏడీసీ కర్ణాకర్ పాల్గొన్నారు.

# వైన్స్ షాప్ ను తరలించాలి

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ ఉండడం వల్ల గ్రామ యువత చెడు అలవాట్లకు, మద్యానికి బానిసలై బలైపోతున్నారని గ్రామంలోనీ పలు సంఘాల, రాజకీయ నాయకులు యువకులు, ఉద్యోగులు వ్యాపారవేత్తలు, వ్యవసాయదారులు గ్రామ పెద్దలు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఈ వైన్ షాపును తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళకు దిగుతామని హెచ్చరించారు. ఇటీవల కాలంలోనే యువత మద్యానికి అలవాటు పడి యాక్సిడెంట్ రూపంలో మరణించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరంగా ఎక్సైజ్ శాఖ స్పందించి తగిన చొరవ తీసుకుని వైన్ షాప్ ను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర:** పరకాల నియోజకవర్గంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు పరకాల మహిళా స్కిల్ డెవలప్‌మెంట్, మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌ను దృఢ సంకల్పంతో ఏర్పాటు చేస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెల్లలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఈ హబ్‌లో పరకాల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం (ఓరియంటేషన్ ప్రోగ్రామ్) సెర్ప్, వి–హబ్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆవరణలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో ఒక మహిళ ప్రాథమికంగా చిన్న పారిశ్రామికవేత్తగా అంచెలంచెలుగా ఎదగడానికి ఈ హబ్ ఒక పునాది అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, మహిళలు సాధికారతను సాధించాలని అన్నారు. వీ–హబ్ సీఈవో సీత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళా వ్యాపారవేత్తలకు ఆర్థిక బలాన్ని వీ–హబ్ అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను మాట్లాడుతూ పరకాల మహిళా స్కిల్ డెవలప్‌మెంట్, మినీ మ్యానుఫ్యాక్చరింగ్, మహిళా డెయిరీ ఏర్పాటు గురించిన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, పరకాల ఆర్‌డీవో డాక్టర్ కె. నారాయణ, దామెర తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, వీ–హబ్ ప్రతినిధులు, పరకాల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించాలి

## ఎన్ఎస్‌పీఎస్-2025 పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, జనగామ:** విద్యార్థులలో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలిని పెంపొందించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాలను వేరుచేసే అలవాట్లను విద్యార్థులకు అలవర్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ తయారుచేసిన నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్ఎస్‌పీసీ) 2025 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని విద్యా సంస్థల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. థీమ్: "హరిత్ – ద వే ఆఫ్ లైఫ్" నిర్వహణ పర్యావరణ సంరక్షణ (పీఎస్జీ) రిజిస్ట్రేషన్ జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు ఉంటుందన్నారు. దీని ఫలితాలు ఆగస్టు 30న ప్రకటస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ విధానం 'ఎకో మిత్రం' యాప్ ద్వారా చేసుకోవచ్చరన్నారు. క్విజ్ హిందీ, ఇంగ్లీష్, ఇతర భారతీయ భాషలలో ఉంటుంది. దీనికి రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. మొక్క నాటుతున్న, నీరు ఆదా చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోటీ విభాగాలు 1 నుంచి 5వ తరగతి, 6 నుండి 8వ తరగతి, 9 నుంచి 12వ తరగతి, డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, సామాన్య పౌరులు (ఇతరులు) విభాగాలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి తక్షణమే ఈ–సర్టిఫికెట్ లభిస్తుందని, విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ జీసీడీవో గౌసియా బేగం, ఏఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్వీ కర్ణన్‌ను కలిసిన సిలివేరు శ్రీకాంత్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** జమ్మికుంట పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ బుధవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆర్.వి. కర్ణన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ కర్ణన్‌కు పూల మొక్కను అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో దళిత కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకాన్ని సమర్థవంతంగా పూర్తి చేసిందని, దళిత కుటుంబాల జీవితాలలో వెలుగులు నింపిందని సిలివేరు శ్రీకాంత్ ఈ సందర్భంగా ఆర్.వి. కర్ణన్‌కు గుర్తు చేశారు.

# తెలంగాణ చేనేత కళలపై డాక్యుమెంటేషన్




**వరంగల్ వాయిస్, కొత్తవాడ:** జైపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్ అండ్ డిజైన్ (ఐఐసీడీ) యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు కొత్తవాడలో రెండో రోజు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నాడేలు చేసే ప్రక్రియ, కలంకారీ ప్రింటింగ్ విధానాన్ని డాక్యుమెంట్ చేశారు. తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సిల్తో ఐఐసీడీ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల క్రాఫ్ట్స్, చేనేత మగ్గాలు, వాటికి సంబంధించిన పని విధానాలను తెలుసుకుని రికార్డు చేస్తున్నారు. తెలంగాణలోని లేస్ అల్లికలు, పంజా మగ్గం, లెదర్ ఉత్పత్తులు, బ్రాస్‌పై చెక్కడాలు, కర్రపై చెక్కడాలు, స్టోన్‌పై చెక్కడాలు వంటి చేతితో తయారు చేసే హస్తకళలను రికార్డు చేసి భావి తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి పూనుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు, స్థానిక మంత్రికొండా సురేఖకు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు రోజులుగా జైపూర్ యూనివర్సిటీ విద్యార్థులకు దగ్గర ఉండి అన్ని రకాల చేనేత మగ్గం, కార్పెట్స్ తయారీ విధానాన్ని చూపించినందుకు వెంకటేశ్వర్లుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాసాని కరుణాకర్, బొల్లు సతీష్, పెండెం రమేష్, ఆడెపు రవి, డీఆర్‌డీఏ అధికారి అశోక్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులు హేయం



**వరంగల్ వాయిస్, రేగొండ:** ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలపై నిష్పక్షపాతంగా వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. తిరుపతి రెడ్డి, పట్టెం కోటిలింగం, బండి సోమయ్య, కటకం రాజు, నామాల రమేష్, పల్నాటి రాజు, బండి శ్రీనివాస్, రొంటాల శంకర్, సుంకరి శ్రీధర్, వెంగల రణధీర్, మంతెన మధు, సురేష్, బండి కమలాకర్, లడ్డు, మార్తా రాజు, బోయిని రాజు, రహీం పాషా, అంబాలా రవీందర్ పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ

## ఓ చీకటి అధ్యాయం




**భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలాన్ని ఒక చీకటి అధ్యాయంగా స్పష్టంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ఈ ప్రభువులకు సేవలు అందించేందుకు శాసన నిర్మాణ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఏర్పడ్డాయి. అయితే, ఎమర్జెన్సీ సమయంలో ఈ వ్యవస్థలన్నీ మూగబోయాయి. పవిత్రమైన ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ నిరంకుశ నిర్ణయాలకు తెరతీశారు. తద్వారా మానవ హక్కులు కాలరాయబడ్డాయి. రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక హక్కులు మంటగలిశాయి. ఆ కఠినమైన మలుపు తిరిగిన చీకటి రోజు 1975 జూన్ 25. ఆ రోజున అప్పటి భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన ఏకఛత్రాధిపత్య నిర్ణయంతో భారతదేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఈ నిర్ణయం విధిగా కాకుండా విచిత్రంగా జరిగింది. 'ఎమర్జెన్సీ విధింపు వ్యక్తి తప్పిదమా? వ్యవస్థ తప్పిదమా?' అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఆ సమయంలో దేశంలోని అధికారులు, న్యాయవ్యవస్థ, పోలీసులు ఎవరూ దీన్ని అడ్డుకోలేకపోయారు. ధైర్యం, ధీరత్వం చూపకుండా కట్టుబానిసలుగా మారిపోయి పవిత్రమైన మన ప్రజాస్వామ్యాన్ని బూడిద చేసేందుకు దోహదపడ్డారు.**

- **1975 జూన్ 25 మరిచిపోలేని రోజు**
- **బానిసత్వ లక్షణాల పర్యవసానమే ఎమర్జెన్సీ**
- **దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు**

రాజ్యాంగం హత్యకు గురైందని చెప్పవచ్చు. ప్రజల హక్కులు హరించబడ్డాయి. ఒక వ్యక్తి మొత్తం వ్యవస్థను ఎలా తన చెప్పుచేతల్లో పెట్టుకుంది? అతి తేలికగా రాష్ట్రపతితో ఎలా ఆమోదించుకోగలిగింది? ఎమర్జెన్సీ ప్రకటన తర్వాత అంత కచ్చితంగా ఎలా అమలు చేయగలిగింది? ప్రభుత్వమంటే ఇందిరా నెహ్రూ గాంధీ (ఇందిరాగాంధీ అసలు పేరు) ఒక్కరే కాదు కదా! ప్రధానమంత్రి, మంత్రి మండలి వ్యవస్థ ఉంటుంది. మంత్రి మండలి, విస్తృత అధికారగణం కలిస్తేనే ప్రభుత్వం కదా! భారతీయ జనతా పార్టీ ఆ రోజును 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటించి, పాటించి సాధించేదేముంది, కాంగ్రెస్ పార్టీని, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను తిట్టిపోసి ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అనే విమర్శలున్నాయి. ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం నుంచి వెతకాల్సింది, నేర్చుకోవాల్సిందేమైనా ఉందా? ఏదేమైనా, ఒక జ్యోతిని వెలిగించి చీకటిని రూపుమాపాల్సిందేమైనా ఉందా అనే అంశాన్ని చర్చకు తీసుకురావడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

### బానిసత్వ లక్షణాల పర్యవసానమే ఎమర్జెన్సీ విధింపు..

ఏ దేశ రాజ్యాంగ పరిధిలోనైనా ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే అందుకు అవసరమైన చర్చలకు ఆ దేశ మంత్రి మండలి సమావేశమవుతుంది. ఆ చర్చల నిర్ణయాలకనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయబడతాయి. కాగా, ఎమర్జెన్సీ ప్రకటనకు ఇందిరాగాంధీ తన ఏకఛత్రాధిపత్య నిర్ణయం తీసుకున్నాక మంత్రి మండలి కేవలం ఆమోదం తెలిపింది. ఇది ఒక దుర్మార్గమైన, బానిసత్వపు చర్యగా అభివర్ణించవచ్చు. ఇందిరాగాంధీ తన మంత్రివర్గాన్ని నమ్మకుండా గోప్యతను పాటించి ఎమర్జెన్సీ ప్రకటన నిర్ణయం తీసుకుని అమలు చేయించింది. ఇలా ఎమర్జెన్సీ అమల్లోకి వచ్చిన తర్వాత మంత్రివర్గం ఎమర్జెన్సీ నిర్ణయాన్ని ఆమోదించింది. ఇందిరాగాంధీ చర్యలకు మంత్రివర్గం డూడూ బసవన్నలా తల ఊపడమే ఇందుకు కారణంగా మారింది.

కేవలం ఒక వ్యక్తి తన చుట్టూ ఉన్న సిద్ధార్థ్ శంకర్ వంటి కపట న్యాయవాది, మూడు పదులు దాటని తన కుమారుడు, ఒక రాజ్యాంగేతర శక్తి సంజయ్ గాంధీ, ఇంకా కొద్ది మంది కోటరీతో ఒక రాజ్యాంగ వ్యతిరేకమైన నిర్ణయం, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే నిర్ణయం తీసుకున్నప్పుడు మంత్రి మండలి, న్యాయవ్యవస్థ, అధికారగణం, పోలీసు శక్తులు ఎందుకు దీనిని అడ్డుకోలేకపోయాయి? ప్రభుత్వంలో లేని వారి గురించి నేను రాయడం లేదు. ప్రభుత్వంలో ఉన్న, ప్రభుత్వంలో భాగమైన వారి గురించే నేను అడుగుతున్నాను. రాజ్యాంగంపై ప్రమాణం చేసింది వారే కదా! వారి ప్రధాన కర్తవ్యం కదా! రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారు? లేదా రాజ్యాంగానికి వ్యతిరేక నిర్ణయాన్ని ఎందుకు అమలు పరిచారు? రాజ్యాంగాన్ని రక్షించడానికి అధికారం ఒక శక్తివంతమైన ఆయుధం అయినప్పుడు, అదే అధికారం రాజ్యాంగ విరుద్ధ ఆదేశాలను అమలు చేసేందుకు లొంగిపోయినప్పుడు ప్రజాస్వామ్యం చీకటి కాకుండా ఎలా ఉంటుంది? ప్రజలు పాలకులను ఎన్నుకున్నది రాజ్యాంగ పరిరక్షణకు కాదా! ఇది అర్థం చేసుకోవాలంటే ఎమర్జెన్సీ అమలుకు ముందు, అమలు తర్వాత పరిస్థితులను ఒకసారి నెమరువేసుకోవాలి. కేవలం పిడికెడు సంఘటనలను ఆధారం చేసుకుని నిఘా వర్గాల నివేదికలను భూతద్దంలో చూపించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 352ని దుర్వినియోగపరిచింది.

### ఎమర్జెన్సీకి దారితీసిన కీలక సంఘటనలు..

★ 1971 మార్చి: ఇందిరాగాంధీ భారీ మెజారిటీతో తిరిగి ప్రధానమంత్రి పదవిని చేపట్టారు.

1973 ఏప్రిల్: ముగ్గురు నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన న్యాయమూర్తులను పక్కనబెట్టి ఏఎన్ రేను సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా నియమించగలిగింది.

★1974 జనవరి: కాంగ్రెస్ పార్టీకి చెందిన గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంతో గద్దె దిగిపోవాల్సిందిగా విద్యార్థులు పెద్ద ఎత్తున 'నవనిర్మాణ్' పేరుతో ఉద్యమించారు. తప్పనిసరి పరిస్థితిలో మార్చి నెలలో సీఎం గద్దె దిగాల్సిన వచ్చింది.

★ బీహార్ ఉద్యమం: బీహార్ రాష్ట్రంలో కూడా 'ఛాత్ర సంఘర్ష్ సమితి' విద్యార్థులు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి జయప్రకాష్ నారాయణ్ ను నాయకత్వం వహించాల్సిందిగా ఆహ్వానించింది.

★ 1974మే 8: జార్జ్ ఫెర్నాండెజ్ దేశవ్యాప్త రైల్వే సమ్మెకు పిలుపునిచ్చారు.

★ 1974 సెప్టెంబర్: పార్లమెంటులో ఇందిరాగాంధీ పాండిచ్చేరి లైసెన్స్ కుంభకోణంలో ఎంపీ తుల మోహన్ లాల్ సహా 20 మంది ఎంపీల సంతకాలు ఫోర్జరీ చేసిన ఆరోపణల విషయంలో తీవ్రంగా అపహాస్యం పాలైంది. ఈ విషయంలో అప్పటి విదేశీ వ్యవహారాల మంత్రి బబిరా నారాయణ్ మిశ్రాపై ఆరోపణల గుసగుసలు వినిపించాయి.

★ నవంబర్ 1974: ఇందిరాగాంధీకి, జయప్రకాష్ నారాయణ్ కు మధ్య చర్చలు విఫలమయ్యాయి. బీహార్ ప్రభుత్వం అసమర్థత, అవినీతి, అవి మర్థతల కారణాలతో అసెంబ్లీని రద్దు చేయాలని బీహార్ ఛాత్ర సంఘర్ష్ సమితి లేవనెత్తిన ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. గుజరాత్ ప్రభుత్వం రద్దులాగే బీహార్ ప్రభుత్వ రద్దుకు కూడా విద్యార్థులు పట్టుబట్టారు.

★ అలహాబాద్ హైకోర్టు తీర్పు: ఈ సంఘటనలన్నీ కాంగ్రెస్ పార్టీ, వారి ప్రభుత్వాల అసమర్థత, అవినీతికి వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమాలైతే, నేరుగా ఇందిరాగాంధీని లక్ష్యంగా చేసుకున్న కీలక పరిణామం రాజనారాయణ్ వేసిన కేసు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమంగా తనపై గెలిచిందని రాజనారాయణ్ వేసిన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగన్‌మోహన్‌లాల్ సిన్హా ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని 1975 జూన్ 12న చారిత్రాత్మక తీర్పునిచ్చారు. ఈ తీర్పును ప్రభావితం చేసేందుకు ఇందిరాగాంధీ, ఆమె ఇంటెలిజెన్స్, చివరికి చీఫ్ జస్టిస్ ఆఫ్ అలహాబాద్ హైకోర్టు ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ధర్మ ప్రభువులు జస్టిస్ జగన్‌మోహన్‌లాల్ సిన్హా లొంగలేదు. చరిత్ర లోతుల్లోకి వెళ్లి వెతికితే చివరికి సదరు జస్టిస్ జగన్‌మోహన్‌లాల్ సైతం ఎన్ని ఇబ్బందులు, బెదిరింపులు ఎదుర్కోవలసి వచ్చిందో తెలుస్తుంది. ఆయన తీర్పుకి ఒక రోజు ముందు కనిపించకుండా పోవాల్సి వచ్చిందని చరిత్ర చెబుతోంది. చివరికి తీర్పుని ఇందిరాగాంధీ విదేశీ పర్యటనలు ముగిసే వరకు వాయిదా వేయాలని ఒత్తిడి తెచ్చినట్లుగా చరిత్ర చెబుతోంది. తీర్పు అనంతరం ఇందిరాగాంధీకి వ్యతిరేక, అనుకూల ప్రదర్శనలు జరిగాయి. అయితే, తీర్పుకు నాలుగు రోజుల ముందే ఇందిరాగాంధీ నమ్మిన న్యాయవాది జూన్ 1975లో దేశ అంతర్గత భద్రత పేరుతో అత్యవసర పరిస్థితి విధించి, వ్యతిరేకులందరినీ జైలులో వేయాలని సూచిస్తూ లేఖ రాయడం జరిగింది. 1975 జూన్ 23 నుంచి అరెస్టుల పర్వం మొదలైంది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ అయ్యర్ ఇచ్చిన పాక్షిక స్టేతో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఉత్తర్వులను అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ముందు వ్యతిరేకించినా, ఆ తర్వాత ఆమోదిస్తూ సంతకం చేశారు. అదే రోజు రాత్రి రామ్‌లీలా మైదానంలో జయప్రకాష్ నారాయణ్ ఇందిరాగాంధీ పదవి నుంచి తొలగాలంటూ ర్యాలీ చేపట్టడం జరిగింది. దాదాపు కృష్ణ ధావన్ గదిలో సమావేశం జరిగింది. ఇందులో రాజకీయ నాయకుల అరెస్టుల కోసం ఏర్పాట్లు చర్చించబడ్డాయి. ఈ సమావేశంలో బన్సీలాల్, ఓం మెహతా, ఐజీపీ (సీఐడీ) కేఎస్.లజ్జా, పోలీసు చీఫ్ బీకే. కోహ్లా, డిప్యూటీ లీడర్, లెఫ్టినెంట్ గవర్నర్ కిషన్ చంద్ర తదితరులు తీహార్ జైలులో ఖైదీల కోసం స్థలాన్ని సిద్ధం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అధికారులు బన్సీలాల్, ఓం మెహతా, పోలీసు అధిపతులు ఎవరూ సందేహించలేదు, ఎదురు నిలబడలేదు. ఆర్కే. ధావన్ (రాజేందర్ కుమార్ ధావన్) భారత ప్రధాని ఇందిరాగాంధీకి అత్యంత సన్నిహిత సహాయకుడు (పర్సనల్ సెక్రటరీ). అత్యవసర పరిస్థితి సమయంలో అతని పాత్ర అనేక విమర్శలకు లోనైంది.

### అకారణంగా అరెస్టులు..

ఒక లక్షకు పైగా ప్రజలు, ముఖ్యంగా విపక్ష నాయకులు, అనుమానితులు, విద్యార్థులు ఎలాంటి కారణం లేకుండా, ఒక్క రాత్రిలో బహుళ అరెస్టులు జరిగాయి. అరెస్టుల జాబితా ముందస్తుగానే సిద్ధం చేసుకున్నారు.

**వారెంట్ లేకుండా అరెస్టులు:** పలువురు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు ఎలాంటి అరెస్టు వారెంటు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అరెస్టులు చేపట్టారు. కొన్ని చోట్ల పోలీస్ వారెంట్లను అరెస్టు చేసిన తర్వాత సిద్ధం చేసి దానికి న్యాయరూపం కల్పించారు. ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో కూడా పోలీసు చర్యలు తీసుకున్న సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి.

**క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఉల్లంఘన:** అరెస్టులపై వివరణ ఇవ్వడం, న్యాయమూర్తి ఎదుట కోర్టులో హాజరుపరచడం వంటి సీఆర్పీసీ ప్రక్రియలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా కోర్టుల పర్యవేక్షణను అడ్డుకున్నారు. సుప్రీంకోర్టు కూడా ఏడీఎం జబల్‌పూర్ కేసులో అత్యవసర పరిస్థితిలో జీవిత హక్కు కూడా లేదని తీర్పునిచ్చింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో నిజాయితీ, నీతి, న్యాయం, ధీరత్వం, అవసరమైనప్పుడు తిరుగుబాటు చేసే నేర్పరితనం ఉన్నవారికే ఓట్లు వేసి ఎన్నుకోవాలి. వారి స్థానంలో పిరికితనం, అవినీతి, అన్యాయం, లొంగిపోయేవారు వంటి నెగటివ్ లక్షణాలున్న అక్రమార్కులను ఎన్నుకుంటే ఇలాంటి చీకటి రోజులనే మళ్లీ, మళ్లీ చూడాల్సి వస్తుంది. స్వాతంత్ర్యానంతరం కూడా అధికారులు బ్రిటీష్ పాలనలో నేర్చుకున్న విధేయతను వదలడం లేదు. వారి మనస్తత్వంలో ప్రభుత్వానికి విధేయతే ఉద్యోగుల ధర్మం అన్నట్లుగా ఉంది తప్ప ప్రజలకు విధేయత కలిగి ఉండడమే ప్రభుత్వ ఉద్యోగి ధర్మం అనేది గ్రహించలేకపోతున్నారు. ఈ విషయాన్ని గ్రహించే కాబోలు, భారతీయ జనతా పార్టీ మోడీ నాయకత్వం ఎమర్జెన్సీ గురించి ఈ తరానికి చెప్పాలనుకుంటోంది. బీజేపీ చేపట్టిన అమృత్ కాల్ ప్రధాన లక్ష్యాలలో ప్రధానమైనది ఇదే సారం. ఈ దేశంలో బానిసత్వ ఆలోచనా విధానం, బానిసత్వ లక్షణాలు వదిలించుకోవడమే. అది వ్యక్తులైనా, వ్యవస్థలైనా, ప్రజలైనా, పాలకులైనా!



రచయిత:
**బూడు శ్యామ్ ప్రసాద్ పటేల్**
ప్రముఖ న్యాయవాది, ములుగు
సెల్ నెం. 9533332777



# గిరిజన ఆశ్రమ పాఠశాలగా మార్పు

- గురుకులంగా అభివృద్ధి చేసేందుకు కృషి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** గిరిజన హాస్టల్ ను ఆశ్రమ పాఠశాలగా అప్ గ్రేడ్ చేయించడంతో పాటు గురుకుల పాఠశాల స్థాయిలో అభివృద్ధి చేస్తానని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. బుధవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని గిరిజన హాస్టల్ డార్మేటరీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ గిరిజన హాస్టల్ భవనం పూర్తిగా నిరుపయోగంగా ఉందని తన దృష్టికి వచ్చిన వెంటనే రూ.63.50 లక్షలు మంజూరు చేయించి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయించి ఈ రోజు పునః ప్రారంభించుకున్నామని తెలిపారు. అతి త్వరలోనే గిరిజన వసతి గృహాన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రహరీ, ల్యాండ్ లేవలింగ్ చేయాల్సిన అవసరం ఉందని దీనికి త్వరలోనే ప్రతిపాదనలు పంపి మంజూరు చేయిస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, డీటీడీఓ ప్రేమకళ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్, ఎంఈఓ, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అంటేనే ప్రజా, రైతు సంక్షేమ ప్రభుత్వం..

ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ.21వేల కోట్ల రుణ మాఫీ, గడిచిన తొమ్మిది రోజుల్లో సుమారు 60లక్షల మంది రైతులకు రూ.9వేల కోట్ల రైతు భరోసా అందించి కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం శివునిపల్లిలోని వ్యవసాయ మార్కెట్ లో రూ. 2.12కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆధునిక బిగ్ కవర్ షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించి ఆధునిక బిగ్ కవర్ షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సమీకృత డివిజనల్ లెవల్ ఆఫీస్ నిర్మాణం..

స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో రూ.26కోట్లతో నిర్మించనున్న సమీకృత డివిజనల్ లేవల్ ఆఫీస్ కాంప్లెక్స్ పనులకు కడియం శ్రీహరి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరితగతిన పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ గా సుజిత్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వరంగల్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గా ఆరేపల్లి సుజిత్ నియమితులయ్యారు. ఆర్మూర్ లో జరిగిన ఏబీవీపీ అభ్యాస వర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జానా రెడ్డి ఈ మేరకు నియామకం చేపట్టారు. సుజిత్ నిరంతరం విద్యారంగ సమస్యల మీద పోరాడుతూ అనేక ఉద్యమాలు నిర్వహించడం జరిగింది. కాకతీయ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన సుజిత్ 2020 నుంచి ఏబీవీపీలో కార్యకర్తగా, నగర కార్యదర్శిగా, జిల్లా కన్వీనర్ గా, ప్రాంత కార్య సభ్యులుగా పనిచేశారు. విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థులు జాతివాదులుగా తీర్చిదిద్దడంలో సుజిత్ కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యత ఇచ్చినందుకు ఏబీవీపీ రాష్ట్ర శాఖకు తెలంగాణ ప్రాంత ప్రముఖ మాసాడి బాపూరావు, విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హర్షవర్ధన్, ఏలేటి నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా హనుమకొండ జిల్లా కన్వీనర్ గా ధూళిపూడి హరిచరణ్ ను నియమించారు.

# నిషేధిత గుడుంబా సరఫరా

## వ్యక్తి పై కేసు నమోదు




**వరంగల్ వాయిస్, ములుగు :** నిషేధిత గుడుంబాను ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన దుర్గం గిరిబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సై ఇనిగాలా వెంకటేష్ అధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏటూరు గ్రామంలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నిధితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూ.6వేల విలువైన గుబుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బతకడానికి చాలా మార్గాలు ఉన్నాయని ఎవరు కూడా నిషేధిత గుడుంబాను సరఫరా చేయడం గాని అమ్మడం గాని చేయరాదన్నారు. గుడుంబాతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఎవరైనా అక్రమంగా గుడుంబా సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే 8712670139, 8712670089 నెంబర్ కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దీనికితోడు సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషకం ఇస్తామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.



# ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు చేయండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి 12 మోరీల పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హంటర్ రోడ్డులోని 12 మోరీల ప్రాంతంలో రౌండ్ షేప్ లో జంక్షన్ ఏర్పాటు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బుధవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మేయర్ 12 మోరీల ప్రాంతంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎంజీఎం, వరంగల్ బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ తో పాటు హనుమకొండకు వెళ్ళే ముఖ్య కూడలిగా ఉన్న ఈ ప్రాంతంలో వాహనదారుల సౌలభ్యం, ట్రాఫిక్ నియంత్రణకు రౌండ్ షేప్ జంక్షన్ ఏర్పాటు అత్యవసరమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో దీనిని అభివృద్ధి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, డీఈ రాజ్ కుమార్, ఏఈ రాగి శ్రీకాంత్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, టీపీఎస్ అనిల్, శానిటరీ ఇన్ స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులెక్కడ..?

- కలెక్టర్ స్నేహ శబరీష్
- హాజరు శాతం తక్కువ ఉండడంతో సీరియస్




**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఎంపీపీఎస్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరానికి గాను ఎంత శాతం విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ అయిందని, కొత్త యూనిఫామ్స్ విద్యార్థులకు ఇచ్చారా, ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించిన కలెక్టర్ హాజరు శాతం తక్కువగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలు చెబుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలలోని 6, 9వ తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల ప్రాంగణంలోని మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట గదిని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరును పరిశీలించి కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంఈఓ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com